# అర్థంకానిది!

వింధ్యవాసిని

లోకంలో అర్థం కాని విషయాలవుతే ఎన్నో వున్నయ్. కానీ అవన్నీ మన కిప్పుడు అప్రస్తుతం. అయితే 'నీ కెప్ప టికీ అర్థంకాని దేవిటయ్యా?' అని రామా రావనే ఒక వ్యక్తిని అడిగి చూడండి, "ఆడదాని మనసు" అని టక్కున సమా ధానం వస్తుంది. అసలీ రామారావంటే ఎవరూ, ఇతగాడి కథా కమామిషూ ఏమిటీ? అని అడుగుతారా. ఇదుగో ఇదే సమాధానం..

త్రిశంకు స్వర్గంలో వేళ్లాడే మధ్య తరగతి జాతికి చెందిన ఒక మెంబరు రామారావు. ఇతడి నివాసం ఒక మహా నగరంలో! ఉద్యోగం యూనివర్సిటీ లెక్చరర్ గిరీ; కుటుంబం భార్య, ఒక కొడుకూను. అత నుంటున్న యిల్లు యూనివర్సిటీనించి బస్సులో పది నిము షాల్లో వెళ్ళగల మార్గం. ఇంటిదాకా వెళ్ళటం సులువే కానీ, ఇంట్లోకి వెళ్ళటమే కొత్త కష్టం. ఎందుకంటే ఆ ఇల్లుంటు న్నది నాలుగంతస్థుల ఒక భవనపు నాలుగో అంతస్థులో. అసలు దాన్ని ఇల్లనటంకంటే గది అంటే బావుంటుం దేమో. అందులో వున్నవి ఒక మంచం, ఒక టేబిల్, ఓ కుర్చీ, ఓ బుక్ షెల్ఫ్, రెండు సూట్ కేసులూ. ఒక పక్కగా చిన్న పార్టిషన్‌తో ఏర్పడ్డ వంటగదీను. దీన్నిబట్టి ఆ గది ఎంత మల్టీపర్పస్‌గా వుపయోగిస్తుందో మనకి అర్థం అవు తుంది. వంటగది పోగా మిగిలిన భాగం, సిట్టింగ్ కమ్ స్లీపింగ్ కమ్ రీడిం! రూమన్నమాట. వంటగది నానుకు' వున్న బాత్‌రూమ్‌లో మరీ లావా! వాళ్ళవుతే ఖాయంగా ఇరుక్కు పోవ! సిందే. ఇంతోటి ఇంటికీ అద్దె నూర్రు పాయలు నెలనెలా చెల్లించుకుంటున్నారు

ఇక అసలు విషయానికొద్దాం. ఆ వే! శనివారం. మిగతా రోజులకంటే కాస్త త్వరగా ఇంటికొస్తాదు రామారావు. అంద కని మామూలుగా సుమతి ఏదయినా టిఫిన్ చేస్తుంది శనివారం సాయంత్రాలు. ఆవేళ మధ్యాహ్నమే ఆలోచించి నిర్ణ యించుకుంది పకోడి చేయాలని సాయంత్రం. పకోడి వేడిగా అవుతేనే బావుంటుందని మూడింటికి మొదలు పెట్టింది చేయటం. ఉల్లిపాయలు తరిగి, పిండి కలుపుకుని, స్టవ్‌మీద నూనె పెట్టే సరికల్లా రానేవచ్చాడు రామారావు. లోప లికి వచ్చీరాంగానే, చేతిలో పుస్తకాలు టేబిలుమీద పడేసి, షూస్‌ని మంచం కిందికి తోసేసి, షర్ట్ విప్పి దండెంమీద గిరాటేసాడు. మంచంమీద నిద్రపోతున్న బాబు పక్కనే పడుకుని న్యూస్‌పేపర్ చేతిలోకి తీసుకుని "సుమా! కాసిన్ని మంచినీళ్ళు పట్రా" అని కేకేసాడు.

వళ్ళు మండింది సుమతికి. అతను రాగానే చక్కగా బట్టలు మార్చుకుని, విప్పిన బట్టలు హేంగర్స్‌కి తగిలించి వుంచి బుక్స్ నీట్‌గా షెల్ఫ్‌లో సర్ది, కాళ్ళూ ముఖం కడుక్కుని తనదగ్గిర




కూచుంటే చక్కగా కబుర్లు చెబుతూ, టిఫిన్ పెట్టాలనుంటుంది తనకి. కాని అతనెప్పుడూ అలా చెయ్యడు. అంతపెద్ద ఇంట్లో అతడికి మంచినీళ్ళందుకోవాలన్నా కష్టమే మరి.

"అబ్బ! రాగానే ఆ న్యూస్ పేపరొకటీయనకి తద్దినంలాగా. ఏమండీ కాస్త బట్టలు మార్చుకుని ముఖం కడుక్కోరాదూ! టిఫిన్ పెడతాను" అని ఇవతలికి రాకుండానే కేకేసింది.

అసలీ మాటలేవీ అసలు మనిషి చెవికే ఎక్కినట్లులేవు "మంచినోళ్ళోయ్" అని మళ్ళీ విన్పించింది బయట్నించీ. "తన పాటే గానీ నా మాట వినిపించుకోరుకదా?" అని గొణుక్కుంటూ, గ్లాస్‌తో నీళ్ళు తీసుకుని వెళ్ళింది.

"అలా పడుకుని పేంటంతా నలపక పోతే కాస్త బట్టలు మార్చుకోరాదుటండీ!" అంది. "మార్చుకోరాదనేం కాదుగానీ, అసలు లుంగీ ఎక్కడుందో నాకెలా తెలుస్తుంది?"

"మీ లుంగీన్నేను వంటింట్లో దాచుంచుతానా ఏం? అదెప్పుడూ ఆ దండెం మీదే వుంటుందిగా?" అని విసుక్కుంటూనే లుంగీ అతనికి అందించి, అతడు విప్పిన పేంటూ, షర్టు తీసి నీట్‌గా హేంగర్స్‌కి తగిలించి, పుస్తకాలన్నీ షెల్ఫ్‌లో సర్ది, వంటింట్లోకి వెళ్ళింది.

ఇంకాసేపుంటే సుమతి మళ్ళీ దండకం మొదలు పెడుతుందని భయపడి, బాత్‌రూమ్‌లో దూరి తలుపేసుకున్నాడు రామారావు.

మూకుడులో నూనె మరుగుతూంది. పిండి చిన్నముద్దలుగా చేసి వేద్దామని గిన్నెలో చేయి పెట్టబోయింది సుమతి. ఇంతలో బాత్‌రూమ్ తలుపు తెరుచుకుంది. "సుమా! టవల్ నా టవల్ ఇటివ్వు" అంటూ ముఖంమీద నీళ్లు కారుతూ బయటికొచ్చాడు.

"అబ్బ! టవల్ కూడా తీసుకోలేరు కదా?" గొణుగుతూనే టవల్ అందించింది సుమతి.

"అదికాదు సుమా! నా టవలేదో నాకు గుర్తుండి చావదు. ఏదో ఒకటి తీసుకుంటే అది నీదనో, బాబుదనో గోల పెడతావు నువ్వు" అని చిరునవ్వులు వలకబోస్తూ, ముఖం తుడుచుకుని సుమతి పక్కనే పీట వాల్చుకుని కూచున్నాడు.

వేడివేడి పకోడీల ప్లేటు అందించింది సుమతి. ఒక్కొక్కటే నెమ్మదిగా నములుతూ "భలే రుచిగా వున్నాయోయ్. తింటే నువ్ చేసే పకోడీలు తినాలి .. వాహ్ ..మార్వెలెస్ " అని గాలికొట్టి వుబ్బేస్తూ ప్లేటు ఖాళీ చేశాడు రామారావు.

లోలోపల సంతోషిస్తూనే పయికి మాత్రం, "అబ్బ! పొగడటంలో మీరు ఎక్స్‌పర్టండీ! సరేగానీ ఇంకో నాలుగు వెయ్యమన్నారేమిటి?" అడిగింది సుమతి.

రామారావుకీ తెలుసు, పొగడ్తకో నాలుగు పకోడీలు ప్లేటులో కొస్తాయని. అయినా అన్నీ తనే తినేస్తే పాపం ఇక సుమతికేం మిగలవని, రెండుసార్లు మాత్రమే నాలుగు చొప్పున వేయించుకు తిని, కాఫీ తాగి నింపాదిగా లేచాడు.

మళ్ళీ వెళ్ళి మంచం మీద కూచుని, పేపరు అందుకోబోయాడు. అంతలో బాబు నిద్ర లేచి రాగం మొదలుపెట్టాడు "అమ్మా" అంటూ.


లోపలినించే కేకేసింది సుమతి. "కాస్త బాబు నెత్తుకోండీ" అంటూ. అతనికా మాట విన్పించిందో లేదో సుమతికైతే తెలీదుగానీ బాబు రాగం మాత్రం ఆపలేదు.

"ఏం చేస్తున్నారండీ?" అంటూ మళ్ళీ కేకేసింది.

## సుభాషితాలు

మనిషి ఎదుటివారికి ధారాళంగా దానంచేసే వాటిలో మొదటిది సలహా.

—రోష్‌ఫోకాడ్




జవాబుగా ఏడుస్తున్న బాబు నెత్తుకుని లోపలికొచ్చాడు రామారావు. "వాడు "అమ్మా!" అనేడుస్తూంటే నన్నెత్తుకో మంటావేమిటోయ్? ఇప్పుడేగా నిద్ర లేవటం—నా మాట వినడుగానీ కాస్త నువే ఎత్తుకుందూ?" అని అందించి మళ్ళీ తన పేపర్ రీడింగ్‌లో పడి పోయాడు.

అప్పుడే దోగాడటం నేర్చుకున్న బాబుని ఆ చిన్న వంటగదిలో పట్టు కోవటం మహా కష్టం. వదిలేస్తే,చెంబూ, తప్పేలాలు మధ్యలో పోగేసి ఆట మొదలు పెడతాడు. వళ్ళో కూచోబెట్టుకుని వాడి కోసం రెడీగా వుంచుకున్న పాలు తాగిం చింది సుమతి.

"కాలేజీకీవెళ్ళి ఉద్యోగం చేసిరావటం తప్పించి, ఇంట్లో ఇటున్న పుల్లని అటు వెయ్యరు కదా? అసలీయనకు నే నంటూ ఓ మనిషిని అస్తమానూ పనితో సతమత మయి పోతూంటానని అర్థమవుతుందో లేదో ఆ దేవుడికే తెలియాలి. ఈ మాత్రానికిలా వుంది. నేనూ ఏ ఉద్యో గమో మొదలుపెడితే ఇక రెండు రోజులకే మంచంలో పడిపోతానేమో నేను. అందుకే కాబోలు, ఎప్పుడు నే నుద్యోగం చేసే మాట వచ్చినా తేలిగ్గా కొట్టి పారేస్తుంటా రీయన. అయినా మరీ కాస్త పిల్లడినయినా తీసుకోకపోతే ఎలా వేగటం?" అని తనలోనే తనే అను కుంటూ పని చేసుకుపోతూంది సుమతి.

వంట ముగించి బాబుకి పాలు పట్టి, నిద్ర పుచ్చేసరికి ఎనిమిది గంటలయింది. రామారావు, సుమతి భోజనాలు ముగించే సరికి తొమ్మిదిగంటలు కొట్టాయి. అంట్ల గిన్నెలన్నీ తోముకుని, బాత్‌రూము, వంట గది శుభ్రం చేసేసరికి మరో అరగంట పట్టింది సుమతికి. రామారావు ఎప్పుడూ అంటోనే వుంటాడు, పనిమనిషిని

పెట్టుకోరాదా అంత కష్టపడకపోతే అని. "ఆయనకేం తెలుస్తుంది? మా బాగా అంటారు పనిమనిషిని పెట్టుకోరాదా అని. ఈ సిటీలో పనిమనిషి అంటే మాటలు కాదు. ఏ ఇరవయి రూపాయలో ఇచ్చుకోవాలీ మాత్రం పనికి" అనుకుంటుంది సుమతి.

పని ముగించి ముందు గదిలోని కెళ్ళింది సుమతి. రామారావింకా చదువుకుంటున్నాడు. బాబుకి పక్క బట్టలు సర్ది, తానూ పడుకోబోతూ అంది_"రేపాది వారమేగా? ఇంక పడుకోరాదాండి" అని.

"ఏంవిటో విశేషం?" అన్నాడు రామారావు.

"పడుకోవటానికి విశేషమేంటండీ. మీది మరీ చోద్యం" బుగ్గలు నొక్కుకుంది సుమతి.

"అది కాదమ్మాయ్. పదిన్నర దాటందే నాకు నిద్ర పట్టదని తెలుసు నీకు. అయినా పది గంటలు దాటకముందే పడుకోమంటున్నావంటే . "

"అంటే లేదు, గింటే లేదు. మీ ఇష్టంబాబూ. నేనేమో పడుకుంటున్నా అంతే" అంటూ దిండుమీద తలవాల్చింది.

"పోనీలేవోయ్. అంతగా అడుగుతున్నావుగా. నేనూ పడుకుంటా? మా బంగారువిగా. కాసిన్ని మంచినీళ్ళు తెచ్చి పెట్టుదూ" అన్నాడు పుస్తకంమీంచి దృష్టి మరల్చకుండానే.

ఏకళనుందో, విసుక్కోకుండా మంచినీళ్ళ గ్లాసు అందించింది. నీళ్ళు తాగి, గ్లాస్ని బల్లమీదుంచి, సుమతి చేయిపట్టి దగ్గరికి తీసుకున్నాడు.

"అరే. ఈవాళ మల్లెపూలు పెట్టుకోలేదేం?"

"ఆఁ! మీరు తెచ్చారా ఏం నేను పెట్టుకోవటానికి."

"సారీ డియర్, మరిచిపోయా. అయినా నువ్వింటిదగ్గిర తీసుకుంటావుగా?"

"మీరు స్వయంగా తెస్తే వున్న సంతోషం, ఇంటిదగ్గిర కొంటే రాదని మీ కెన్నిసార్లు చెప్పానో. అయినా ఎప్పుడో తప్ప తేవాలని మీకు గుర్తు రాదు. మీకు నిజంగా ఇంటరెస్ట్ వుంటే గుర్తురాకుండా వుంటుందా? ఈవాళ మీమీద కోపం వచ్చే ఇంటిదగ్గిర కొనలేదు" తలవంచుకుని అంది సుమతి.

"పిచ్చిదానా! అంత చిన్న విషయాన్ని ఇంత సీరియస్గా తీసుకోవాలా? ఇప్పట్నించీ ఇంకెప్పుడూ మరిచిపోకుండా, నీకోసం పూలుతెస్తా రోజూ, సరేనా? . ఏదీ ఇంకా కోపమే .." అని అంటూనే, ఆమె జుట్టులో ముఖం దాచుకుని, అందులోంచి వస్తున్న షాంపూ వాసనల్ని అనుభవించ సాగేడు. ఇలా కోపం రావటం, భర్తతో పోట్లాడటం సుమతికి మామూలే. అయినా అతను కాస్త మెత్తగా మాట్లాడి, దగ్గరికి చేర్చుకునేసరికి అన్నీ మరిచిపోతుంది.

* * *

ఆవేళ ఆదివారం. గంట ఎనిమిది దాటింది. తీయటి కలలు కంటూ, ఇంకా నిద్రపోతూనేవున్నాడు రామారావు. బాబుకి స్నానం చేయించి, తనూ స్నానంచేసి వంటచేయటం మొదలుపెట్టింది సుమతి.

బాబుకి తాను నిద్రలేచాక, ఇంట్లో

ఇంకెవరూ నిద్రపోవటమనేది నచ్చదు అందుకని తండ్రిని ఎలా లేపాలా అని ప్రయత్నాలు చేస్తున్నాడు మంచం పట్టుకుని, మెల్లిగా నిలబడి నాన్న చెవిపట్టుకు లాగాడు గబుక్కున దుప్పటిని నిండా కప్పేసుకున్నాడు రామారావు ముఖం నిండా కాస్త లాగి కప్పుకోవటంతో పాదాలు బయటికొచ్చాయి బాబు గబగబా అటువేపు దోగాడి వెళ్ళి కాళ్ళు పట్టుకు లాగాడు ఇంక లేవకపోతే తప్పేట్టులేదనుకున్నాడు రామారావు అయినా ముసుగు తీయకుండానే,"సుమా! పైమెంతయిందోయ్, అప్పుడే లేపమని వీణ్ణి పంపించావా?" అని అరిచాడు

"అప్పుడే ఏమిటి? ఇంక లేద్దురూ ఎనిమిది గంటలు దాటిపోయింది"

దుప్పటి తొలగించి లేచి కూర్చుని, ఆవలించి, బాబుని ఓ ముద్దు పెట్టుకుని, "టిఫిన్ చేస్తున్నావా?" అన్నాడు

"మీ కిష్టమయిందే ఇవాళ దోశెలు పోస్తున్నాగానీ, త్వరగా లేచి ముఖం కడుక్కోండి"

దోశెలనేసరికి సంతోషంతో మంచం దిగి, లలలా అని పాడుకుంటూ, బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు రామారావు

కాఫీకి నీళ్ళుపెట్టి, కాఫీ పొడి డబ్బా అందుకుంది సుమతి "సుమా! నా బ్రష్ కనిపించటం లేదోయ్ కాస్త చూసి పెడుదూ"బాత్‌రూమ్‌లోంచి విన్పించింది

'అబ్బ! కంటి ముందున్న వస్తువులు కూడా కనిపించవు కదా ఈయనకి?" అని విసుక్కుంటూ వెళ్ళి బ్రష్ అందించింది

రామారావు ముఖం కడుక్కుని కాఫీ తాగేసరికి, బల్లమీద షేవింగుసెట్, వేడి నీళ్ళు, అద్దం, రెడీగా వున్నాయి

"ఆదివారమేగా? రేపు చేసుకుంటాలే సుమా షేవింగ్" అంటూ పేపర్ అందుకోబోయాడు

"ఆదివారమయితేనేం? బద్ధకించకుండా తొరగా షేవింగ్ చేసుకుందురూ ఇంకా టిఫిన్ తిని, తలంటుకోవాలిగా మీరు" అంది సుమతి కొబ్బరిపచ్చడి రుబ్బుతూ

"ఏంటోయ్ ఇవాళ సినిమా ప్రోగ్రాం ఏమయినా వేశావా ఏం? అంతగా బతిమాలుతున్నావ్ షేవింగు చేసుకోమని ఏమి సినిమా చూడాలనో"

"మనం సినిమాకెళ్ళి ఎన్నాళ్ళయిందో సినిమా మాటెత్తితో నేర్పుగా దాటించేస్తారు ఎప్పుడూ బయట తిరిగే మీకు సినిమా అంటే ఇష్టంలేకపోవచ్చు కానీ నాకోసమయినా తీసికెళితేనేం?"

"అసలిప్పుడేమన్నానోయ్? నేనేం తీసికెళ్ళననలేదుగా, నువ్వు అడగటం నేను కాదనేంత ధైర్యమా ఏమి సినిమానో తెలుసుకుందామని అంతేగాని, అయినా నాకెందుకులే ఏ సినిమానో సినిమా చూసినా నాకు పేరు గుర్తుండదు అసలు" అంటూ షేవింగ్ మొదలుపెట్టాడు

ప్రతీ ఆదివారం తలంటుకుని స్నానం చేయటం చిన్నప్పట్నించీ అలవాటు రామారావుకి దానికి, పెళ్ళికాకముందు తల్లీ, పెళ్ళయాక సుమతీ సహాయం చేస్తున్నారు ఆదివారం ప్రోగ్రామ్‌లో భార్యాభర్తలిద్దరికీ ఇష్టమయిన కార్యక్రమమూ అదే ఆముదంతో తల అంటి, వంటికంతా రాయటానికి, సుమతి సహాయం చేస్తున్నంత

సేపూ ఏదో ఒకటి అంటూనే వుంటాడు రామారావు.

మర్దనా చేయటంలో సుమతి చేయి ఏకాస్త గట్టిగా తగిలినా, "ఊఁ! బాగా అంటించు. ఆడవాళ్ళకి మొగుడిమీద అధికారం చెయ్యటానికీ, తమ కోపమంతా చూపించటానికి ఇది మంచి ఛాన్స్. నీ ఇష్టమొచ్చినట్లల్లా మర్దిస్తున్నావుగా? కానీ ఏంచేస్తాం, నీ చేతిలో చిక్కిపోయాను." అంటాడు.

ఎక్కడయినా కాస్త నూనె ఎక్కువ రాసినా,"బాగా లోనికి పోనియ్యి. అయినా నాకేం? ఆ జిడ్డంతా పోగొట్టలేక అవస్త పడేదీ నువేగా?" అంటాడు.

"మీది మరీ చిన్నపిల్లాడి వాటం. కొంచెంసేపు కుదురుగా కూచోలేరు కదా? అయినా మరీ అలా పిల్లజమీందారులా సిటారుగా కూచోకపోతే, కాస్త పంటికి రాసిన నూనె రుద్దుకోకూడదూ?" అని చివాట్లేస్తుంది సుమతి.

అలా కీచులాటలతో,నవ్వులతో ముగుస్తుంది ఆఫార్స్ ఆదివారాలు. మధ్యాహ్నం భోజనం అయేక, చిన్న కునుకు తీద్దామని మంచంలో చేరాడు రామారావు. వంట సామాన్లు సర్దుతున్న సుమతి, "నిద్ర పోయేరు ఇవాళ మీ బట్టలన్నీ ఇస్త్రీ చేయాలి. ఉతికి వుంచాను నిన్న" అంది.

"సాయంత్రం సినిమా ప్రోగ్రాం వేశావుగా?"

"సాయంత్రంవెళ్ళే సినిమాకి,ఇప్పుడు ఇస్త్రీ చేయటానికొచ్చిన కష్టమేమిటి?"

"అదికాదు సుమా. నా కసలు సరిగ్గా చేయటం రాదుగా? నేను ఐరన్ చేసినా, ఎలాగూ నీకు నచ్చదు. మళ్ళీ చేయకుండా వుండవు."

"నేను చేసేటప్పుడు చూసి, కాస్త మెల్లిగా చేయటం నేర్చుకోండీ అంటే వినరుకదా? మీ బట్టలు మీరు ఇస్త్రీ చేసుకోకపోతే ఎలా? ఎన్ని పనులని చేయను నేను. ఆ పేంట్లు, ఒక్కొటి ప్రెస్ చేసే సరికి నా ప్రాణం పోయినట్లవుతుంది. అయినా నాదే తప్పు. మొదట్లో మీ కేమీ నేర్పకుండా, అన్నీ నేనే చేయటం తప్పయింది. ఇప్పుడు బాబుతోటి తీరకున్నా. అన్ని పనులూ చచ్చినట్లు నేనే చేయాలి సిందే ." సుమతి ఇంకా అలా గొణుగుతూ వుండగానే రామారావుకి నిద్ర పట్టేసింది.

మధ్యాన్నం ఇస్త్రీచేయటం ముగించి, సాయంత్రం త్వరగా వంట కానిచ్చి రెడీ అయి రామారావుకి మేలుకొలుపు పాడింది టైమయింది లేవమంటూ.

చక్కగా ముస్తాబయి, పిల్లాన్నొకరూ, పిల్లాడి సరంజామాగల బాస్కెట్ నొకరూ పుచ్చుకుని, ఉషారుగా బయలుదేరి, నాలు గంతస్థుల మెట్లూ దిగి రెట్టింపయిన వుత్సాహంతో సినిమాకి వెళ్ళిన ఆ దంపతులు, ఆకలితో దిగేసుకున్న ముఖాలతో, నిద్రపోతున్న బాబుని మోసుకుని,ఉసూరుమంటూ తిరిగివచ్చారు. అన్ని మెట్లూ ఎక్కి తమ గృహాన్ని చేరేసరికి సగం ప్రాణం పోయింది సుమతికి.

అయినా ఓపిక తెచ్చుకుని పక్క సర్ది బాబుని పడుకోబెట్టి, బట్టలు మార్చుకుని, కంచాల్లో అన్నం వడ్డించింది.

భోజనం ముగించి లేస్తుండగా, పక్క

సుభాషితాలు

ప్రతీ పురుషుడు స్త్రీని అర్థం చేసుకున్నాననుకుని బోల్తా పడుతుంటాడు.

—డేవిడ్ మెకాలే




పొడి అందించి, "నేనింకా సామాన్లవీ కడుక్కోవాలి. ఈలోగా, కాస్త మీ పక్క దులుపుకుని, దోమతెరలు కట్టేయండి." అని భర్తకి పురమాయించి తన పనిలో పడిపోయింది.

రామారావుకి సినిమాలంటే యిష్టం వుండదు. అప్పుడప్పుడూ కాస్త తలనొప్పి కూడా వస్తూంటుంది సినిమా కెళ్ళినరోజు. ఆవేళ కూడా కొద్దిగా తలనొప్పిగా వుంది అతడికి. మెల్లిగా వెళ్ళి బాబు పక్కనే చోటు చేసుకుని కళ్ళమీద చేయిపెట్టుకుని పడుకున్నాడు. ఒక ఐదు నిమిషాలు అయాక సుమతి చెప్పిన పని చేద్దాం అనుకుని, తెలీకుండానే నిద్ర పట్టేసింది అలసటవల్ల.

తన పనంతా ముగించుకుని, ముఖం కడుక్కుని తుడుచుకుంటూ పడుకుందామని వచ్చింది సుమతి. పక్కా, దోమతెరా రెడీచేయకపోగా నిద్రపోతున్న భర్తని చూచి వళ్ళు మండిపోయింది సుమతికి.

"ఇంక జన్మలో ఈయన్ని సినిమాకి తీసికెళ్ళమని అడగను. తనలాగే నేనూ అలసిపోయుంటానని ఆయనకి తోచదుగా? ఏదో నాకోసంగా వచ్చి, మహా కష్టపడిపోయినట్లు చేస్తారు. ఆ పాడు సినిమాలు వద్దు-ఈ గొడవా వద్దు" అనుకుంటూ, అతడి పక్కవేసి, రెండు దోమతెరలూ కట్టింది.

"మీ పక్కలో వచ్చి పడుకోండి" అంటూ భర్తని లేపింది. కళ్ళు తెరిచిన రామారావు, అలసిపోయి చిన్నబోయిన

సుమతి ముఖంలోకి చూడగానే కరిగి పోయాడు.

"బాగా చాలయిపోయింది కదూ!" అంటూ దగ్గిరికి తీసుకోబోయాడు.

ఇష్టం చూపక ముఖాన్ని తిప్పేసు కుంది సుమతి.

"ఎందుకోయ్. దోమతెరలవీ రెడీ చేయలేదని కోపమా" అంటూ గడ్డాన్ని పట్టి తనవైపు తిప్పుకున్నాడు.

సుమతి కళ్ళనిండా నీళ్ళున్నాయి. అలాగే అడిగేసింది. "ఏమండీ మీ కళ్ళకి నేనెలా కనిపిస్తాననలు? ఒక సర్వెంట్‌లా కాకుండా, మీ అర్ధాంగినని మీ కెప్పుడ యినా అనిపిస్తుందా?" అని గొంతు బొంగురుపోయింది.

ఆమె నోటిని మూసేస్తూ, "ఛ! ఏం మాటలు సుమా? నా ప్రాణమయిన నిన్ను నేను సర్వెంట్‌లా చూస్తానా? నువ్వెందు కలా అనుకుంటావు? బధ్ధకంవల్ల అప్పు డప్పుడూ నిన్ను బాధిస్తుంటానే గానీ, నువ్వు లేకపోతే నేను బ్రతకలేనని నీకు తెలీదా సుమా? నువ్వు చెప్పినట్లు చేస్తాను. ఇంకెప్పుడూ ఇలాంటి మాటలనకు, నేను భరించలేను" అంటూ దగ్గిరికి తీసు కున్నాడు.

* * *

బాబుకి రెండ్రోజులనించీ జ్వరం. ఆ వేళే కాస్త నెమ్మదించింది. అయినా అస్తమానూ దేనికో దానికి పేచీపెట్టి ఏడుస్తూనే వున్నాడు. వాడితో వేగలేక విసుగెత్తిపోయింది సుమతికి.

మధ్యాహ్నం వాడు నిద్రపోయేసరికి తానూ వాడి పక్కనే మేను వాల్చింది. బాగా పట్టేసింది నిద్ర. తలుపు వేయటం కూడా గుర్తులేక పోయింది. ఎప్పుడు లేచాడో బాబు శబ్దం చేయకుండా వరండా లోకి వెళ్లాడు.

నిద్రలో చేత్తో తడిమి చూసుకుని ఉలిక్కిపడి లేచి కూచుంది సుమతి. బాబు కన్పించలేదు గబగబా వరండాలోకి వెళ్ళి చూసింది. మోట్లనానుకుని వున్న పిట్ట గోడని-తన చిన్న చేతులతో పట్టుకుని మొదటి మెట్టు మీద నిలుచుని వున్నాడు. సుమతిగుండె గుభేలుమంది. ఒక్క అంగలో వెళ్ళి అందుకో బోయింది. అంతలో బాబు కొంచెం ముందుకి జరిగాడు.

"బాబూ" అని అరిచి సుమతి పట్టు కునేలోగా, ఒక్క క్షణంలో పదిమెట్లు దొర్లిపోయాడు. అదృష్టకొద్దీ ఎవరో పయికి వస్తున్నారు అతను బాబుని చూసి, గబుక్కున దొర్లకుండా పట్టుకున్నాడు. సుమతి వాళ్ళ పక్కనున్న మూడో ఇంటి అతను ఆయన.

అతడు బాబుని సుమతికి అందించే సరికే బాబుకి స్పృహలేదు. కళ్ళు మూసు కుని వున్నాడు. సుమతికి కళ్ళు తిరిగాయి. ఏమి చేయాలో కూడా తోచలేదు. బాబుని పట్టుకున్నతనే, తన ఇంట్లోకి వెళ్ళి తన భార్యని ఆమెకి తోడుగా, డాక్టర్ దగ్గిరికి పంపేడు. సుమతి ఇల్లుతనే తాళంపెట్టాడు. స్పృహలేకుండా వేలాడిపోతున్న బాబుని తీసుకుని, పక్కింటామె సహాయంతో, బస్‌లో ఎక్కి అక్కడికో మైలుదూరంలో వున్న డాక్టర్ దగ్గిరికి బయలుదేరింది ఆమె.

## సుభాషితాలు

మన గొప్పతనాన్ని మెచ్చుకునే మనిషికంటే మన బలహీనతలను చూసి జాలి సలహా చెప్పేవాడు నిజమైన స్నేహితుడు —షె




ప్రమాదమేమీ లేదనీ, తలకి కాస్త గట్టిదెబ్బ తగలటంచేత స్పృహ పోయిందనీ చెప్పి అరగంటలో ఏదో ఇంజక్షన్ ఇచ్చి స్పృహ తెప్పించాడు డాక్టర్ కానీ రెండు రోజుల్లో నెమ్మదించిన జ్వరం మళ్ళీ తిరగబెట్టింది బాగా టెంపరేచర్ వచ్చేసింది ఏవో మందులు ఇచ్చి పంపాడు డాక్టర్

మళ్ళీ సిటీబస్ కాచ్ చేసి సుమతి ఇల్లు చేరేసరికి సాయంత్రం ఆరుగంటలయింది

తల పగిలిపోతూంది సుమతికి నొప్పితో నిద్రపోతున్న బాబుని మంచం మీద జాగ్రత్తగా పడుకోబెట్టి కాస్త టీ పెట్టుకు తాగింది ముఖం కడుక్కుంది అంతటయిమయినా రామారావింకా ఇంటికి రాలేదు కాలేజీలో మీటింగ్సేమయినా వుంటే ఇలా లేట్ అవటం అప్పుడప్పుడూ జరిగేదే కానీ ఈవాళ బాబుకింద స్పృహపోవటం, డాక్టర్ దగ్గరికి రావటం చాలా చిరాకుగా వుంది సుమ ఏమీ పనిచేయాలన్పించలేదు దానికి భర్త రాకపోవటం మరింత చిరా వుంది

అలాగే వెళ్ళి అన్నానికి ఎసరు సింది కూరలు ఏమీ చేయాలన్పిం ఊరగాయ వేసుకోవచ్చులే ఈ ష అనుకుంది గంట ఏడున్నర అవుతుం ఇంటికొచ్చాడు రామారావు. అ అలాగే నిద్రపోతున్న బాబు పక కూచుంది సుమతి లేపకుండా, బాబు పడుకున్నాడేం అనిగానీ, నువ్వెంద వున్నావనిగాని అతను అడగలేదు వయిపే అతని దృష్టిపోలేదు లాపంగా కుర్చీలో కూచుని షూస్

కుంటూ, "అలాగే కూచున్నావేం. కాస్త కాఫీ ఇవ్వు" అన్నాడు. మవునంగా వెళ్ళి కాఫీ కప్పు అందించింది సుమతి. కానీ రోజూలా బట్టలు మార్చుకోమనీ సర్ది పెట్టమనీ కూడా కేకవేయలేదు ఆమె. అందు కాశ్చర్యంగానే వున్నా, ఏమీ ప్రశ్నించలేదు రామారావు.

అతడి ఉదాసీనత చూసి, అడిగితే తప్ప ఏమీ చెప్పకూడదనుకుంది సుమతి. మవునంగా స్టవ్ మీదున్న అన్నాన్ని వార్చింది. "ఆకలిగా వుంది. అన్నం వడ్డించు" అన్నాడు రామారావు కాళ్ళు, ముఖం కడుక్కుని.

రెండు ప్లేట్లల్లో అన్నం వడ్డించి, రెండు పచ్చడి సీసాలు పెరుగుగిన్నె దగ్గరికి జరిపింది సుమతి.

"కూర చేయలేదూ?"

" . ... . "

అలసిపోయున్నాదేమో జవాబు రాక పోయేసరికి కోపం వచ్చింది రామారావుకి.

"అడిగిందానికి జవాబు చెప్పటం కూడా కష్టమయిపోయిందే?"

జవాబు చెప్పకుండా ఏడ్చేసింది. "ఛ! ఎప్పుడూ ఏడుపేనా? నోరు విప్పి సరిగ్గా మాట్లాడవు. గట్టిగా అడిగితే ఏడుస్తావు" ఏమో నీవరస నాకు నచ్చలేదు సుమతీ" అసలిప్పుడు నేనేమన్నానని అంతలా ఏడవటం? కూర చేయలేదా అని అడగటం కూడా తప్పేనా?"

ఉక్రోషం వచ్చేసింది సుమతికి. "అవునండీ మీ దృష్టిలో మీరు చేసేవన్నీ రైటు. నేను చేసేవేమో తప్పు. అయినా నేనేడిస్తే మాత్రం మీ కొచ్చిన నష్టమేవిటి? అసలు ఇంట్లో వాళ్ళు ఎలాపోతే మీకేం? మీ పనులూ, మీ భోజనం మీ నిద్ర మీకు సక్రమంగా అమర్తే చాలు ఇంక ఏ విషయమూ అక్కర్లేదు. రెండు రోజులనించీ బాబు జ్వరంతో నేనెంత సతమతమయి పోతున్నా, మీ పనుల్లో మాత్రం లోటు రానియ్యలేదు. పూచిక పుల్లంత సహాయమయినా చేశారా నాకు మీరు? ఇవాల్టికి వాళ, ఎంత ప్రమాదం తప్పిందో. మెట్లు మీంచి కింద పడి కళ్ళు తేలేశాడు బాబు. ఏమీ చేయటానికి కాళ్ళు, చేతులు రాక ఎంత తల్లడిల్లిపోయానో. అప్పుడనంగా వాణ్ణి తీసుకుని డాక్టర్ దగ్గరికి వెళ్ళిం దాన్ని ఇప్పుడే కాస్సేపయింది వచ్చి. కనీసం రెండు రోజులయి జ్వరం కదా బాబు ఎలా వున్నాడో చూద్దామని అన్నా మీకు అన్పించిందా? మీ కనిపిస్తే, ఇంత ఆలస్యంగా వస్తారా? ఒక్కరోజుకి కూడా, మీ వ్యవహారాలు మానుకోలేరు గదా మా కోసం? వచ్చాకయినా ఒక్కమాట అడిగారా బాబుకెలావుంది అనిగానీ, నువ్వలా వున్నావేం అనిగానీ. నా పిచ్చి గానీ మీ రెందుకడుగుతారండీ, ఎంత సేపూ, నా భర్త, నా ఇల్లు, నా బిడ్డ, నా సంసారం అని నేను పడే తాపత్రయంలో మీకు వీసమంతయినా ఉందా?" అలా ఎంతసేపు మాట్లాడి వుండేదోకానీ, రామారావు ఆవకాయ వేసుకుని భోజనం మొదలు పెట్టటంతో ఆపేసింది

అయిదు నిముషాల్లో భోజనం ముగించి వెళ్ళి, రెండు పక్కలూ వేసి. దోమ తెరలు కట్టి, బాబుని పడుకోబెట్టాడు రామారావు. తన బల్లదగ్గర కూచుని

పుస్తకం ఒకటి చేతిలోకి తీసుకున్నాడు.

వంటిల్లు సర్దేసి వచ్చిన సుమతి మవునంగా బాబు పక్కన చేరి పడుకుంది. భర్త ఏదయినా మాట్లాడితే బావుండు ననుకుంది. కానీ అతనేమీ మాట్లాడటానికి ప్రయత్నించలేదు. లోపలున్న బాధ కన్నీళ్ళ రూపంలో బయటికి రావాలని చూస్తూంది. అయినా గట్టిగా ఏడవాలంటే అహం అడ్డు వస్తూవుంది సుమతికి. చదువు ముగించి వచ్చాక అయినా దగ్గరికి తీసుకుంటాడేమో అనుకుంది.

మరో అరగంటకి లయిటు ఆర్పేడు రామారావు. భార్య పక్కన కూచుని ఒకసారి జుట్టు మీద, చంపలమీద చేయి వేసి నిమిరి, తన పక్కలో పడుకున్నాడు.

నిస్పృహ కలిగింది సుమతికి. అయినా మారు మాట్లాడకుండా తనంత తాను నిద్రపోయింది.

* * *

ఉదయం సుమతి మేలు కొలుపు పాడక ముందే, ఏడింటికే నిద్రలేచాడు రామారావు చెప్పకముందే పక్కలన్నీ సర్ది, బాత్ రూమ్‌లోకి వెళ్ళి ముఖం కడుక్కున్నాడు. సుమతి అందించిన కాఫీతాగి; స్నానానికి వెళ్లేడు. షేవింగ్ ముగించి బాయిలర్ లోంచి తానే నీళ్లు పట్టుకుని స్నానం చేశాడు. వెంటనే విడిచేసిన బనీను డ్రాయరూ ఉతికి ఆరేసాడు.

అంతా గమనిస్తూనే వుంది సుమతి. "ఇదెన్నాళ్ళ ముచ్చటో చూద్దాం" అనుకుంది మనసులో.

సుమతి వడ్డించిన భోజనం తిని, డ్రెస్‌చేసుకుని తనే షూష్ తుడుచుకు వేసుకుని కాలేజీకి బయలుదేరాడు. వెళ్ళే ముందు ఏదో గుర్తువచ్చినవాడిలా లోపలికొచ్చి. "బజారునించి తేవలసిన వేమయినా వుంటే లిస్టు రాసివ్వు. సాయంత్రం పట్టుకొస్తాను వచ్చేటప్పుడు" అన్నాడు.

ఏం లేవంది సుమతి.

వెళ్ళిపోయాడు.

సుమతికి చాలా ఆశ్చర్యంగా వుంది రామారావులోవచ్చిన మార్పు. సాయంత్రం అయిదింటికి ఇల్లు చేరుకున్నాడు రామారావు. రాగానే విప్పిన బట్టలు, షూస్, పుస్తకాలు నీట్‌గా సర్ది, భార్య ఇచ్చిన కాఫీ తాగి ఒక అరగంట ఆరోజుటి పేపర్ చూసుకున్నాడు. మళ్ళీ డ్రెస్ చేసుకుని, కొడుకు నెత్తుకుని డాక్టర్ దగ్గరికి బయలుదేరాడు. ఆవేళ టెంపరేచర్ కొంచెం తగ్గింది వాడికి.

రాత్రి టయిముకి సరిగ్గా భోజనంచేసి, పక్కలు వేశాడు. తన చదువు ముగిశాక లయిటు ఆర్పేసి పడుకున్నాడు.

దాదాపు రోజూ ఇదే దినచర్య. రామారావు, సుమతి మాట్లాడుకోవటమే చాలా మటుకు తగ్గిపోయింది. అంటే సీరియస్‌గా ఏమీలేరు. కానీ అతను అస్తమానూ, ప్రతీదానికీ భార్యని పిలవకుండా తనపని తాను చేసుకునిపోతున్నాడు. సుమతికి పనికి అడ్డురాకుండా బాబుని దగ్గరికీ తీసుకుంటున్నాడు.

వారం రోజులు ఇలాగే గడచిపోయాయి. మొదట రెండు, మూడురోజులూ సుమతికి రిలీఫ్‌గా అనిపించినా, తర్వాత అతడు మరీ, ఏమాత్రం తనమీద ఆధారపడకుండా తన పనులు తాను చేసుకో

వటం, ఏదో వెలితిగా తోచింది. తన పనులు అన్నీ తాను చేసుకోవటంతో, ఇద్దరిమధ్యా మాటలు కూడా చాలా తగ్గిపోయాయి. ఏం చేయాలో ఎక్కడ కల్పించుకుని మాట్లాడాలో కూడా సుమతికి అర్థంకాలేదు. అతడు తన బనీను, డ్రాయరు ఉతుక్కోవటం, రోజూ తలకి నూనె తానే రాసుకోవటం మరింత బాధించాయి ఆమెని. కానీ ఏమి చెప్పాలన్నా, కసురుకుంటాడేమోనని భయం.

మళ్ళీ ఆదివారం వచ్చింది. ఉదయమే సంతోషంగా నిద్రలేచింది సుమతి. ఎన్ని పనులు తానే చేసుకున్నా, తలంటిపోసుకోవటం తన సహాయం లేకుండా అతడికి చాతకాదు. పోనీ అని మానేస్తే, అలవాటు అవటంవల్ల కళ్ళు మండుతాయి. అందుకని తప్పక తన్ని పిలుస్తాడని ఆశించింది. ఆ రకంగా అయినా మళ్ళీ మొదటికి మల్లే అతడికి దగ్గరవాలనుకుంది. ఆవేళ అతనికెంతో ఇష్టమయిన పెరుగుపచ్చడి, పెసరట్లు చేసింది. వారం రోజుల తర్వాత ఆవేళ మళ్ళీ పెసరట్లు బావున్నాయని మెచ్చుకుని తిన్నాడు రామారావు.

టిఫిన్ తినడం అయాక తనని పిలుస్తాడనుకొంది సుమతి. కానీ ఆ సూచన్లేవీ కన్పించలేదు. తనంత తాను బనీను విప్పేసి, ఆముదం సీసా పుచ్చుకుని, కుర్చీలో కూర్చున్నాడు. సీసా వంచి చేతిలో వేసుకునేలోగా, ఇక ఉండలేక పరిగెత్తి వచ్చేసింది సుమతి.

"ఉండండి. మీకు చాతకాదు. నేను రాస్తాను" అంటూ సీసా అందుకోబోయింది. కానీ అతనివ్వలేదు.

"అక్కర్లేదు. నీపని నీవు చూసుకో. చాతకాదు అనేముంది, వారంవారం చేస్తుంటే అదే అలవాటయిపోతుంది."

కళ్ళలో నీళ్ళు తిరిగినాయి సుమతికి.

"ఏమిటండి, మరీ అంతదూరం చేసేంత పాపం నేనేం చేశాను? కాస్త నాకు సహాయం చేయండి, అదీ ఆరోజు ఆ కోపంలో అన్న మాటలకి మీకింత పట్టుదలవుతే నేనేమయిపోవాలి?" అంటూ అతడి భుజంమీద చేయివేసింది.

"అరే. అంతలో కన్నీళ్ళెందుకు సుమా! నువ్వన్నదాంట్లో తప్పుందని నేనన్నానా? నీవు చెప్పిందే కరెక్టుకదా? ఎవరిపనులు వాళ్ళు చేసుకుంటే అందరికీ సుఖంగా వుంటుంది. నీకు కష్టం కలిగించకూడదనే నా ఉద్దేశం కానీ నీమీదేం కోపంలేదోయ్."

"మీరెన్నిచెప్పినా సరే. మీకు తలంటు మాత్రం నేను చేయాలిసిందే" అంటూ, అతడి చేతిలోంచి ఆముదం సీసాని లాక్కుంది.

చేసేదిలేక తలవంచుకుని, "ఏమిటో ఈ అమ్మాయి మాటలు విచిత్రం! తన మనసు నాకెప్పటికీ అర్థం కాదేమో?" అనుకున్నాడు తనలోతానే.

